# ప్రజా మారుతి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 280 పేజీలు : 04 వెల రూ. 2 గురువారం 14 - 05 - 2026




రోజుకు రూ.2 వేలు... హైదరాబాద్ జైల్లో ఒక రోజు ఖైదీగా గడిపే చాన్స్!

# మే నెలాఖరులోగా ఇళ్ల మంజూరు పత్రాలు

- జూన్ 2న ఆదిలాబాద్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం
- మే 21న జరిగే కేబినెట్ సమావేశంలో విధివిధానాల ఖరారు
- లబ్ధిదారుల నివాస ప్రాంతాలకు 5-8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లు
- హైదరాబాద్‌లో సొంత స్థలం ఉన్నవారికి మే చివరికల్లా మంజూరు పత్రాలు



**హైదరాబాద్ :**

రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను మే 21న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.మంగళవారం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల హౌసింగ్, రెవెన్యూ అంశాలపై మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో పొంగులేటి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో సొంత స్థలం ఉండి, అర్హులైన లబ్ధిదారులకు మే నెలాఖరులోగా ఇంటి మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు.గత ప్రభుత్వం హైదరాబాద్‌కు 20-30 - మిగతా 2 లో

## సోషల్ మీడియాలో నిబంధనలు మీరితే కఠిన చర్యలు




- డీజీపీ సీవీ ఆనంద్ వార్నింగ్
- తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు
- పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్
- 27వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలి
- రెండువర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచన




## నా కుమారుడ్ని నేరస్తుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారు

- బండి సంజయ్ ఆవేదన
- తన కొడుకు తప్పు చేయలేదని చెబుతున్నాడన్న బండి సంజయ్
- చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తానని స్పష్టం చేసిన సంజయ్
- రాజకీయ కారణాలతోనే తన కుటుంబాన్ని రోడ్డు మీదకు లాగుతున్నారని ఆరోపణ

# బండి సంజయ్ కుమారుడు పై లుకౌట్ నోటీసులు జారీ చేయాలి

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత
- కుమారుడి నేరం రుజువైతే బండి సంజయ్ పదవికి రాజీనామా చేయాలన్న కవిత
- మోదీతో బండి సంజయ్ వేదికను పంచుకోవడం తప్పుడు సంకేతాలు పంపిందని వ్యాఖ్య
- తెలంగాణలో రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకే తమ పార్టీ పుట్టిందన్న కవిత



**హైదరాబాద్ :**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత విమర్శనాస్త్రాలు సంధించారు. పోక్సో కేసులో ఉన్న బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా పోలీసులు వెంటనే లుకౌట్ నోటీసులు - మిగతా 2 లో

# రైతులకు గుడ్ న్యూస్

## పంటల మద్దతు ధరను పెంచుతూ కేంద్రం నిర్ణయం



- ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం
- రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు
- క్వింటాల్ వరికి రూ. 2,441గా మద్దతు ధర

**ఢిల్లీ :**

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి భారీ ఊరటనిచ్చింది. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా, ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది. పెట్టుబడి ఖర్చుపై 50 శాతం అదనంగా కలిపి కొత్త ధరలను ఖరారు చేశారు. వరి క్వింటాల్‌కు రూ. 2,441 గా నిర్ణయించారు. గ్రేడ్-ఏ వరి క్వింటాల్‌కు రూ. 2,461 గా మద్దతు ధరను ఖరారు చేశారు. ఈ ఖరీఫ్ సీజన్ మద్దతు ధర కోసం కేంద్రం ఏకంగా రూ. 2.6 లక్షల కోట్లను కేటాయించడం విశేషం.వ్యవసాయంతో పాటు రవాణా, ఇంధన రంగాలకు కూడా కేంద్ర కేబినెట్ - మిగతా 2 లో

# ఏపీలో భిన్న వాతావరణం




- కొన్ని జిల్లాల్లో వర్షాలు, మరికొన్నిచోట్ల వడగాల్పులు
- నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం
- బుధవారం పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్ష సూచన
- అల్లూరి, పోలవరం జిల్లాల్లోని కొన్ని మండలాల్లో వడగాల్పులు
- కొన్ని ప్రాంతాల్లో వర్షాలు, మరికొన్ని చోట్ల ఎండ ప్రభావం
- వాతావరణ వివరాలు వెల్లడించిన ఏపీ విపత్తుల నిర్వాహణ సంస్థ

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు - మిగతా 2 లో




## ప్రధాని మోదీ పిలుపుతో లగ్జరీ కారును పక్కనపెట్టి సైకిల్ ఎక్కిన జీఎస్టీ ఉన్నతాధికారి

- ఇంధనం పొదుపు చేయాలన్న ప్రధాని మోదీ పిలుపునకు స్పందించిన జీఎస్టీ అధికారి
- లగ్జరీ కారును వదిలి ఆఫీసుకు సైకిల్‌పై వెళుతున్న డిప్యూటీ కమిషనర్ నరేంద్ర యాదవ్
- దేశ హితం కోసం ప్రతి పౌరుడూ తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపు
- ఒక్కరితో మొదలైన మార్పు ప్రజా ఉద్యమంగా మారే సత్తా ఉందని వెల్లడి




## ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో!

- అసెంబ్లీలో ఉదయనిధి స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు
- విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్ ప్రభుత్వం
- ప్రభుత్వం మనుగడపై ఉదయనిధి అనుమానాలు

# ఏపీలో స్థానిక ఎన్నికల కసరత్తు

- సెప్టెంబర్‌లో నోటిఫికేషన్, డిసెంబర్‌లోగా ఎన్నికల పూర్తికి ప్రణాళిక
- ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా
- వార్డుల విభజన, బీసీ రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ వేగవంతం



**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. ప్రస్తుత పాలక వర్గాల పదవీకాలం ముగియనుండటంతో, సెప్టెంబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, డిసెంబర్ నాటికి మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త ఏడాదికి నూతన పాలకవర్గాలు కొలువుదీరేలా చర్యలు చేపడుతోంది.ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర - మిగతా 2 లో

# ప్రతి ముగ్గురు వైద్యులో ఒకరు అమరావతి నుంచే తయారుకావాలి

- ఇది కొత్త రియాలిటీ... దీన్ని ప్రోత్సహిద్దాం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- వర్క్ ఫ్రం హోమ్ విధానాన్ని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పిలుపు
- పశ్చిమ ఆసియా యుద్ధ నేపథ్యంలో ప్రధాని 8 సూచనలను పాటిద్దామన్న ముఖ్యమంత్రి
- పెట్రోల్ వాడకం, విదేశీ పర్యటనలు తగ్గించుకుని దుబారాకు అడ్డుకట్ట వేయాలని సూచన
- అమరావతిలో బైసర్ ఇనిస్టిట్యూట్, కిమ్స్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- క్వాంటమ్ వ్యాలీతో అమరావతి నుంచి ప్రపంచానికి కంప్యూటర్లు అందిస్తామన్న సీఎం



**అమరావతి :**

ఇంటి నుంచే ప్రపంచం మొత్తం పనిచేసే పరిస్థితి వస్తోందని, ఈ నూతన వాస్తవికతను అందరూ ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలోనూ భవిష్యత్తులో ఈ తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జాతికి ఇచ్చిన 8 పొదుపు సూచనలను రాష్ట్ర ప్రజలందరూ పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు పౌరులు కూడా బాధ్యతగా ఉండి ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని సూచించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒకటి రెండు రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అమరావతిలోని - మిగతా 2 లో

గురువారం 14 - 05 - 2026

# సంపాదకీయం

## స్వంత ప్రయోజనాల కోసం ఆక్రమణలా...

నేటి సమాజంలో ఎక్కడ చూసినా "ఆక్రమణ" అనే పదం సాధారణంగా మారిపోయింది. చిన్న స్థలం నుంచి పెద్ద ప్రభుత్వ భూముల వరకు, ఫుట్‌పాత్‌ల నుంచి చెరువుల వరకు, ప్రజల అవసరాల కోసం కేటాయించిన ప్రతి ప్రదేశం క్రమంగా కొందరి స్వార్థ ప్రయోజనాలకు బలవుతోంది. అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ ఆక్రమణలు భవిష్యత్తు తరాలకు ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ప్రభుత్వ భూములు అనేవి కేవలం ఖాళీ ప్రదేశాలు కావు. అవి రాబోయే కాలంలో పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, ఆటస్థలాలు, ప్రజా అవసరాల కోసం ఉపయోగపడాల్సిన ఆస్తులు. కానీ కొందరు అధికారాల అండతో, మరికొందరు డబ్బు ప్రభావంతో ఆ భూములను క్రమంగా ఆక్రమించుకుంటున్నారు. మొదట చిన్న షెడ్లు, తాత్కాలిక కట్టడాలు వేస్తారు. తర్వాత అవే శాశ్వత నిర్మాణాలుగా మారిపోతాయి. చివరకు అది అక్రమమనే విషయమే మరచిపోయే పరిస్థితి వస్తుంది. వెంచర్లు ఏర్పాటు చేసే సమయంలో "ఇక్కడ గుడి స్థలం", "ఇక్కడ పార్క్", "ఇక్కడ పిల్లల ఆటస్థలం" అని మ్యాపుల్లో చూపిస్తారు. ప్రజలు కూడా భవిష్యత్తులో మంచి వాతావరణం ఉంటుందని నమ్మి స్థలాలు కొనుగోలు చేస్తారు. కానీ సంవత్సరాలు గడిచేకొద్దీ ఆ స్థలాలు కనుమరుగవుతాయి. పార్క్ స్థలంలో షాపులు, గుడి స్థలంలో కమర్షియల్ కట్టడాలు, ఆటస్థలాల్లో ఇళ్లు కనిపించడం ఇప్పుడు సాధారణమైపోయింది. పిల్లలు ఆడుకోవడానికి స్థలం లేక మొబైల్ ఫోన్లకే పరిమితమవుతున్నారు. సమాజానికి అవసరమైన బహిరంగ ప్రదేశాలు క్రమంగా అంతరించిపోతున్నాయి. పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయి. వ్యాపారాలు, హోటళ్లు, దుకాణాలు తమ సరుకులతో ఫుట్‌పాత్‌లను నింపేస్తున్నారు. మరికొన్ని చోట్ల తోపుడు బండ్లు, తాత్కాలిక షాపులు, పార్కింగ్ వాహనాలు ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమిస్తున్నాయి. దాంతో పాదచారులు రోడ్ల మీద నడవాల్సి వస్తోంది. రోడ్డు వాహనాల కోసం, ఫుట్‌పాత్ పాదచారుల కోసం అనే ప్రాథమిక నియమమే కనుమరుగవుతోంది. ఫలితంగా ప్రమాదాలు పెరుగుతున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు, కాలువలు, వాగులు కూడా ఆక్రమణల బారిన పడుతున్నాయి. వర్షపు నీరు వెళ్లే మార్గాలను మూసివేయడంతో చిన్న వర్షానికే పట్టణాలు మునిగిపోతున్నాయి. ప్రకృతి తన మార్గాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించినప్పుడు వరదల రూపంలో నష్టం జరుగుతోంది. మనిషి చేసిన ఆక్రమణలకు ప్రకృతి ఇచ్చే సమాధానం ఇదే. చాలామంది "సమాజ ప్రయోజనం" కంటే "స్వంత ప్రయోజనం" గురించే ఎక్కువగా ఆలోచిస్తున్నారు. "నేను బాగుంటే చాలు" అనే భావన పెరిగిపోతోంది. కానీ గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే? ప్రజా స్థలాలు ప్రతి ఒక్కరి హక్కు. ఆ హక్కును దోచుకోవడం అంటే తోటి ప్రజల జీవనాన్ని ఇబ్బందుల్లోకి నెట్టడం. ఆక్రమణల వల్ల కేవలం భూమి కోల్పోవడం మాత్రమే కాదు, సామాజిక విలువలు కూడా నశిస్తున్నాయి. చట్టాలపై గౌరవం తగ్గిపోతోంది. నిజాయితీగా జీవించే వాళ్లు నష్టపోతున్నారు. భవిష్యత్తు తరాలకు అవసరమైన వనరులు తగ్గిపోతున్నాయి. ఆక్రమణ చేసేది సామాన్యులు, అధికారులు, రాజకీయ నాయకులు ఎవ్వరైనా సరే వారిపైన ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ఆక్రమణలపై రాజకీయాలు కాకుండా నిజాయితీతో వ్యవహరించాలి. అక్రమ కట్టడాలు ఎంత పెద్దవైనా, చిన్నవైనా చట్టపరమైన చర్యలు తప్పక తీసుకోవాలి. ప్రజల్లో చైతన్యం కలిగించాలి, వాళ్లలో బాధ్యత పెరగాల చర్యలు తీసుకోవాలి. ఆక్రమణ ఎవ్వరికి వాళ్లకు చిన్న తప్పుగా అనిపిస్తుంది. కానీ ఆ తప్పు సమాజానికి పెద్ద నష్టం కలిగించవచ్చని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. స్వంత ప్రయోజనాల కోసం చేసే ఆక్రమణలు లాభం ఇవ్వొచ్చు, కానీ సమాజానికి శాశ్వత నష్టం కలిగిస్తాయి. ఆక్రమణ అంటే ప్రజల భవిష్యత్తును అంధకారం చేయడమే.



డాక్టర్. వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్.
9393613555, 9493613555.

## ఏపీలో స్థానిక ఎన్నికల కసరత్తు

**మొదటిపేజీ తరువాయి -** పునేఠా నిన్న అమరావతిలో కీలక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు ఈ భేటీలో పాల్గొన్నారు. ఎన్నికల ఏర్పాట్లు, వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాల్లో వార్డులు, డివిజన్ల పునర్విభజన ప్రక్రియ కొనసాగుతోందని, ఇది జూన్ 26 నాటికి పూర్తికానుందని అధికారులు తెలిపారు. మరోవైపు, బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ తన నివేదికను జూన్‌లో ప్రభుత్వానికి అందించే అవకాశం ఉంది. ఈ నివేదిక ఆధారంగా జులైలో రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 13,291 పంచాయతీలకు ఓటర్ల జాబితాలు ప్రచురించినట్టు సమాచారం. ఈ ఏర్పాట్లన్నీ సకాలంలో పూర్తి చేసి, షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఈసీ భావిస్తోంది.

## ఏపీలో భిన్న వాతావరణం

**మొదటిపేజీ తరువాయి -** కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు.నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, దాని అనుబంధ ద్రోణి కారణంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది.ఇదే సమయంలో, కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన ఎండలు, వడగాల్పులు కొనసాగుతాయని హెచ్చరించింది. ముఖ్యంగా అల్లూరి జిల్లాలోని జీకే వీధి, ముంచింగిపుట్టు, పెదబయలు మండలాలతో పాటు, పోలవరం జిల్లాలోని చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, గుర్తేడు మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఉంటుందని తెలిపింది. మంగళవారం కర్నూలు జిల్లా నాగరడోనలో అత్యధికంగా 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.వర్షాల సమయంలో రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని అధికారులు సూచించారు. కాగా, ఈ అల్పపీడనం రానున్న బుధవారం సాయంత్రానికి మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

## రైతులకు గుడ్ న్యూస్

**మొదటిపేజీ తరువాయి -** పెద్దపీట వేసింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలిపారు. ఇంధన భద్రత కోసం ఈ పథకానికి రూ. 37,500 కోట్లు కేటాయించారు. సర్కేజీ – ధోలేరా మధ్య సెమీ హై స్పీడ్ డబుల్ రైల్వే లైన్ నిర్మాణం కోసం రూ. 20,065 కోట్లు మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

## మే నెలాఖరులోగా ఇళ్ల మంజూరు పత్రాలు

**మొదటిపేజీ తరువాయి -** కిలోమీటర్ల దూరంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించిందని, దీనివల్ల పేదలకు ప్రయోజనం చేకూరలేదని మంత్రి విమర్శించారు. ఈసారి అలా కాకుండా, లబ్ధిదారులు నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లు నిర్మించుకునేలా స్థలాలు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ భూములు అంగుళం అన్యాక్రాంతమైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షలో మల్కాజ్‌గిరిలోని యూఎల్‌సీ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల అంశం ప్రస్తావనకు రాగా, బాధ్యులైన రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.




## ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు అమరావతి నుంచే తయారుకావాలి

**మొదటిపేజీ తరువాయి -** నిడమర్రులో బుధవారం బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (బైసర్) శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.ప్రధాని సూచనల మేరకు పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయవచ్చని చంద్రబాబు అన్నారు. "దేశం మొత్తం దుబారాను తగ్గించాలి. పెద్ద పెద్ద కాన్వాయ్ వాహనాల్లో వెళ్లడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ప్రజాప్రతినిధులు కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించి ఆదర్శంగా నిలవాలి. భద్రతను కూడా కుదించుకోవాలి" అని ఆయన హితవు పలికారు. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, బంగారం కొనుగోళ్లపై కూడా ప్రజలు ఆలోచించాలని సూచించారు. మన దేశంలో, రాష్ట్రంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయని, విదేశాలకు బదులు స్వదేశీ పర్యాటకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు ఎంతో అందమైనవని, సూర్యలంకను గోవాను మించిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. "నా దేశం – నా బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులన్నీ ఆటోపైలట్ మోడ్‌లో ఇచ్చే బాధ్యత తమదని, పారిశ్రామికవేత్తలు వేగంగా నిర్మాణాలు పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ తిరుగులేని శక్తిగా



ఎదగాలని ఆకాంక్షించారు. "ప్రపంచంలోని ప్రతి ముగ్గురు వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిలో ఒకరు అమరావతి నుంచే తయారుకావాలి," అని ఆయన తన లక్ష్యాన్ని స్పష్టం చేశారు. బైసర్, కిమ్స్ సంస్థలు ఈ లక్ష్య సాధనకు దోహదపడతాయన్నారు. 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 250 మెడికల్ సీట్లు, నైపుణ్యాభివృద్ధి ద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించేలా ఈ సంస్థలు విస్తరించనున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది ఇదే రోజున కిమ్స్ ఆసుపత్రి ప్రారంభం కావాలని ఆకాంక్షించారు.అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ రాబోతోందని, ఇది దేశంలోనే ఒక నూతన అధ్యాయమని చంద్రబాబు అన్నారు. "ఈ ఏడాది డిసెంబర్ నాటికి మన దేశంలోనే మొదటి క్వాంటమ్ కంప్యూటర్‌కు ఏపీ చిరునామాగా మారుతుంది. రెండేళ్లలో అమరావతి నుంచి ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్లు సరఫరా చేస్తాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి సంస్థలు ఇప్పటికే పనులు ప్రారంభించాయని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి భారీ ప్రాజెక్టులతో రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని, తన జీవితంలో అలాంటి అరాచక పాలనను చూడలేదని విమర్శించారు. తన ప్రభుత్వ లక్ష్యం పిల్లల భవిష్యత్తు, యువతకు ఉద్యోగాలేనని స్పష్టం చేశారు.గత పాలకులు ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ భారం మోపారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచలేదని, భవిష్యత్తులో కూడా పెంచబోమని హామీ ఇచ్చారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ.20 వేల కోట్లు కేటాయించామని గుర్తుచేశారు. అమరావతిని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని, విశాఖను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్, టెక్నాలజీ హబ్‌గా మారుస్తామని, 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 24 లక్షల ఉద్యోగాలు సృష్టించే లక్ష్యంతో పనిచేస్తున్నామని చంద్రబాబు వివరించారు.

## ప్రధాని మోదీ పిలుపుతో లగ్జరీ కారును పక్కనపెట్టి సైకిల్ ఎక్కిన జీఎస్టీ ఉన్నతాధికారి

**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి దేశానికి సహకరించాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు క్షేత్రస్థాయిలో సానుకూల ప్రభావం చూపుతోంది. ఈ పిలుపుతో స్ఫూర్తి పొందిన జీఎస్టీ శాఖ డిప్యూటీ కమిషనర్ నరేంద్ర యాదవ్, తన విలాసవంతమైన కారును పక్కనపెట్టి ఆఫీసుకు సైకిల్‌పై వెళ్లడం ప్రారంభించారు.ప్రస్తుతం దేశం అంతర్జాతీయంగా పలు సవాళ్లను ఎదుర్కొంటోందని, ఇలాంటి సమయంలో ప్రతి పౌరుడూ దేశ హితం కోసం తన వంతుగా చిన్న ప్రయత్నం చేయడం బాధ్యత అని నరేంద్ర యాదవ్ పేర్కొన్నారు. "సైకిల్ కేవలం పర్యావరణ హితమైన ప్రయాణ సాధనం మాత్రమే కాదు, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి కూడా ఎంతో ఉత్తమమైనది. ఇంధనాన్ని పొదుపు చేయాలన్న ప్రధాని పిలుపును దృష్టిలో ఉంచుకుని, నాకు సైకిల్ ఉత్తమమైన మార్గంగా అనిపించింది" అని ఆయన వివరించారు.ఢిల్లీ ట్రాఫిక్‌లో కారులో వెళ్లినా, సైకిల్‌పై వెళ్లినా ప్రయాణ సమయం దాదాపు ఒకే విధంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. తాను సైకిల్ వాడటం చూసి తన కార్యాలయంలోని ఇతర సిబ్బంది కూడా స్ఫూర్తి పొందుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. దగ్గరలోని మార్కెట్‌కు వెళ్లాలన్నా లేదా ఇల్లు, ఆఫీస్ దగ్గరగా ఉన్నా సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. "ఒక్కరు పాటిస్తే ఏం ప్రయోజనం అని ఆలోచించకూడదు. దేశవ్యాప్తంగా ప్రజలు క్రమంగా ఈ ప్రచారంలో భాగస్వాములైతే, ఇది ఒక పెద్ద ప్రజా ఉద్యమంగా మారే అవకాశం ఉంది" అని ఆయన అన్నారు.'ఫిట్ ఇండియా' ఉద్యమంతో బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా అనుబంధం ఉన్న నరేంద్ర యాదవ్, యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. సైకిల్ తొక్కడం ద్వారా మధుమేహం,



రక్తపోటు వంటి సాంక్రమికేతర వ్యాధులను నియంత్రణలో ఉంచుకోవచ్చని తెలిపారు. ప్రతిపక్షాలు ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నప్పటికీ, అంతర్జాతీయ ఇంధన సంక్షోభాన్ని విస్మరించలేమని, మన వంతుగా పొదుపు చేసే ప్రయత్నాలను కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు.

## ఈ ప్రభుత్వం ఎంతకాలం పనిచేస్తుందో!

**మొదటిపేజీ తరువాయి -** తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ అసెంబ్లీలో తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో స్పష్టమైన మెజారిటీతో విజయ్ ప్రభుత్వం నెగ్గింది. విశ్వాస పరీక్షకు ఓటింగ్ సందర్భంగా డీఎంకే సభ నుంచి వాకౌట్ చేసింది.విశ్వాస పరీక్ష సందర్భంగా ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సభలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త ప్రభుత్వాన్ని ఉద్దేశించి, ఈ ప్రభుత్వం ఎంతకాలం మనుగడ సాగిస్తుందోనని రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎంతకాలం మనుగడ సాగిస్తుందో తెలియని ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు.తమిళనాడులో లౌకికవాద ప్రభుత్వమే ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో రాష్ట్రంలోని దాదాపు 65 శాతం మంది ఓటర్లు ముఖ్యమంత్రి విజయ్, టీవీకేను తిరస్కరించారని ఆసక్తికర



వ్యాఖ్యలు చేశారు. మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చారని, కనీసం ఇప్పుడైనా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే రీతిలో పనిచేయాలని సూచించారు. ఎందుకంటే మీకు ఓటు వేసిన ప్రజలే ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారని అన్నారు.ఈ ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందోనని ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొత్త ప్రభుత్వానికి సూచించారు. విశ్వాస ఓటింగ్‌లో తమ పార్టీ పాల్గొనడం లేదని, డీఎంకే ఎమ్మెల్యేలం వాకౌట్ చేస్తున్నామని ఉదయనిధి స్టాలిన్ తెలిపారు.డీఎంకేతో పాటు మిత్రపక్షమైన ఎంఎంకే కూడా విశ్వాస పరీక్షను వ్యతిరేకించింది. మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ఆ పార్టీ నాయకుడు జవహిరుల్లా ప్రస్తావించారు. డీఎంకే మరో మిత్రపక్షం ఎండీకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించాయి. ఏఎంఎంకే పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఎస్. కామరాజ్ కూడా ప్రభుత్వానికి మద్దతు పలికారు. దీంతో ఆయనను ఏఎంఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు.

## సోషల్ మీడియాలో నిబంధనలు మీరితే కఠిన చర్యలు

**మొదటిపేజీ తరువాయి -**

తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కే. ఇలంబర్తి తదితరులతో కలిసి డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు ఈ నెల 27వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండువర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్–1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్–1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ–1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫిట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు.శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండువర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని మార్గనిర్దేశం చేశారు.పోలీస్, మున్సిపల్, పశుసంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. సీజ్ చేసిన పశువులను సంరక్షించేందుకు తగిన విస్తీర్ణంలో క్యాటిల్ పాండ్‌లను ఏర్పాటు చేయాలని, అక్కడ పశువులకు అవసరమైన సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గందరగోళం సృష్టించేలా పోస్టులు పెట్టే వారిని స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలని చెప్పారు. గతంలో బక్రీద్ సందర్భంగా నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

## బండి సంజయ్ కుమారుడుపై లుకౌట్ నోటీసులు జారీ చేయాలి

**మొదటిపేజీ తరువాయి -** జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఒకవేళ నేరం రుజువైతే బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తండ్రిగా బండి సంజయ్ ప్రధాని మోదీతో కలిసి వేదికను పంచుకోవడం ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపిందని ఆమె అభిప్రాయ పడ్డారు. బాధితురాలి



జీవితాన్ని దెబ్బతీసేలా వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని, ఆ అకౌంట్లను బ్లాక్ చేయాలని కోరారు.పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయాలని కవిత అన్నారు. ఇప్పటివరకు ఆయన ఈ ప్రాజెక్టును ఒక్కసారి కూడా సందర్శించకపోవడం ఏమిటని ఆమె ఆక్షేపించారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని, కానీ తెలంగాణ ప్రభుత్వం నీటి వనరుల వినియోగంలో విఫలమవుతోందని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.కులగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరిగా ఉండాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం దేశవ్యాప్తంగా పోరాడతామని కవిత తెలిపారు. నీట్ పేపర్ లీక్ గురించి ఆమె మాట్లాడుతూ... జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీక్ ఘటనలను కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలని, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. తెలంగాణలో ఉన్న రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికే తమ పార్టీ పుట్టిందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## నా కుమారుడ్ని నేరస్తుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి -** తన కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తొలిసారిగా స్పందించారు. తన కుమారుడిని ఒక నేరస్తుడిగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో జరిగిన హిందూ ఏక్తా యాత్రలో మాట్లాడుతూ



ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం" అని బండి సంజయ్ పేర్కొన్నారు. తన కుమారుడిపై జరుగుతున్న దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోందని, తన భార్య డిప్రెషన్‌లోకి వెళ్తోందని ఆయన ఉద్వేగానికి లోనయ్యారు. రాజకీయ కారణాలతోనే తన కుటుంబాన్ని రోడ్డు మీదకు లాగుతున్నారని ఆరోపించారు.నేను భయపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారని, నేనెప్పుడూ భయపడనని అన్నారు. కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టనని బండి సంజయ్ హెచ్చరించారు.గత డిసెంబర్ 31న హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై మే 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణను పర్యవేక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. మరోవైపు ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ బండి భగీరథ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.

# గట్ల నర్సింగాపూర్‌లో నీటి కష్టాలు తీర్చిన కావేరీ సీడ్స్ చైర్మన్



**భీమదేవరపల్లి, మే 13( ప్రజా మంటలు):-** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీర్చేందుకు కావేరీ సీడ్స్ అధినేత గుండవరం వెంకట భాస్కర్ రావు సొంత నిధులు వెచ్చించారు.గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ విజ్ఞప్తితో స్పందించిన భాస్కర్ రావు 20 రోజుల క్రితం రెండు బోర్లు వేయించారు. బుధవారం ఆ బోర్లకు రెండు కొత్త మోటార్లు బిగించి గ్రామస్తులకు అందుబాటులోకి తెచ్చారు. ఎస్సీ కాలనీలో ఒక నూతన బోరుతో పాటు మోటర్, పైపులు తదితర సామగ్రిని సొంత ఖర్చులతో సమకూర్చారు. మరో పాత బోరును ఫ్లెష్ చేయించారు.కావేరీ సీడ్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, ఉప సర్పంచ్ బొడిగె శ్రీనివాస్, కార్యదర్శి గుడికందుల మధు, వార్డు సభ్యులు బొల్లంపల్లి షెడ్రెక్, సంగ అయిలయ్య, కాసనగోట్టు సాయిరాం, మంద పద్మ, ములుగు కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.గ్రామంలో నీటి ఎద్దడి తీర్చిన భాస్కర్ రావుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## మెటుపల్లిలో సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్ రావుకు ఘన వీడ్కోలు




**మెటుపల్లి, మే 13 (ప్రజా మంటలు):**మెటుపల్లి న్యాయవాదుల ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. ఇటీవల మెటుపల్లి నుంచి జగిత్యాలకు బదిలీ అయిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘన వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. మెటుపల్లిలో పనిచేసిన 20 నెలల కాలంలో బార్ అసోసియేషన్ సభ్యులు చూపించిన ఆప్యాయతలు, ఆదరణ జీవితాంతం మరువలేనివని పేర్కొన్నారు. ఇక్కడి అనుబంధం మరికొంతకాలం కొనసాగాలని దేవుడే తనను జగిత్యాలకు బదిలీ చేసి ఉండవచ్చని వ్యాఖ్యానించారు. విధి నిర్వహణలో భాగంగా ఎవరినైనా నొప్పించి ఉంటే క్షమించాలని కోరారు.అనంతరం న్యాయవాదులు సీనియర్ సివిల్ జడ్జికి శాలువా కప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, మెటుపల్లి మరియు కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రామ్ రెడ్డి, తోట ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, ఏపీపీలు చెర్లపల్లి ఆనంద్ గౌడ్, జి. ప్రణయ్, ఏజీపీ అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, వద్దేపల్లి శ్రీనివాస్, కుమారం శ్రీనివాస్, గంద్ర ప్రవీణ్ రావు, కంతి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.మెటుపల్లిలో సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్ రావుకు ఘన వీడ్కోలు మెటుపల్లి నుంచి జగిత్యాలకు బదిలీ అయిన సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదుల ప్రేమాభిమానాలు జీవితాంతం మర్చిపోలేనివని ఆయన అన్నారు.

# బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

**జగిత్యాల మే 13 (ప్రజా మంటలు):**బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో సామరస్యంతో నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు.బక్రీద్ పండుగ ఏర్పాట్ల గురించి, ప్రార్థనా స్థలాల పరిశ్రుభత, గోవుల అక్రమ రవాణాను నివారించడం,పోలీస్ బందోబస్తు నిర్వహణ ఇతర సంబంధిత అంశాల గురించి కలెక్టరేట్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, పశుసంవర్ధక,రవాణా, మున్సిపల్, హింధు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మత సామరస్యానికి చిహ్నంగా బక్రీద్ పండుగ నిర్వహించుకునేలా పటిష్ట ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లకు మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు సహకారం అందించాలని తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోని కబేళాల వద్ద నీటి సమస్యలను నివారించడానికి తగిన ఏర్పాట్లు చేయాలి సూచించారు. శానిటేషన్ విషయంలో మున్సిపల్, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రార్థనా స్థలాలను పరిశ్రుభంగా ఉంచాలని ఏదైనా చిన్న సమస్య తలెత్తినా వెంటనే సంబదిత అధికారులకు తెలియజేయాలన్నారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, పరస్పర సామరస్యంతో జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం




జరిగిందని అన్నారు. ప్రత్యేకంగా గోవుల అక్రమ రవాణా, గోవధ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన నిఘా ఉంచడం జరిగిందని సంతల్లో కొనుగోలు చేసిన పశువులకు సంబంధిత పశు వైద్యాధికారులచే జారీ చేసిన ఆరోగ్య ధృవీకరణ పత్రాలు, రవాణా అనుమతి పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పత్రాలు లేకుండా పశువులను రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే జిల్లాలో పోలీస్ అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యకమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ , డిఎస్పి లు పురుషోత్తం రెడ్డి,రాములు మరియు పశు సంవర్ధక, రెవెన్యూ, రవాణా, మున్సిపల్ హింధు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు గుండా యాదగిరికి ఉద్యమకారుల నివాళి



**హైదరాబాద్, మే 13 (ప్రజా మంటలు):**తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ ఉద్యమకారుడు గుండా యాదగిరి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ, ఉద్యమకారుల సమన్వయ కమిటీ నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉద్యమకారుల సమన్వయ కమిటీ నాయకుడు రామగిరి ప్రకాష్ ఆధ్వర్యంలో గుండా యాదగిరికి వినమ్ర నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఢిల్లీకి సైకిల్ యాత్రలు, ఆమరణ నిరాహార దీక్షలు వంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గుండా యాదగిరి అహర్నిశలు పోరాడారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలకు ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని వివరించేందుకు ఆయన నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు.తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితిని ఏర్పాటు చేసి, కొండా లక్ష్మణ్ బాపూజీ, కేసీఆర్, ప్రొఫెసర్ కోదండరాం వంటి నాయకులతో కలిసి తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో గుండా యాదగిరి విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ఆయన సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు.ఇటీవల గాంధీ భవన్ ఎదుట ఉద్యమకారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన భిక్షాటన కార్యక్రమంలో గుండా యాదగిరి చూపించిన చొరవ, దిశానిర్దేశం మరువలేనిదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు నిరంతరం ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు.గుండా యాదగిరి ఆశయ సాధన దిశగా పోరాటాన్ని కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని ఉద్యమకారులు పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



**భీమదేవరపల్లి, మే 13:(ప్రజా మంటలు ):**భీమదేవరపల్లి మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదులు,ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి,అడిషనల్ కలెక్టర్ రవి, జిల్లా విద్యాశాఖాధికారి గిరిరాజ్ రావు,స్థానిక ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమే

**నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి**



**భీమదేవరపల్లి మే 13(ప్రజా మంటలు):**అంబేద్కర్ సంఘం మండల కన్వీనర్ బొల్లంపల్లి రాజు డిమాండ్ఇటీవల జరిగిన నీట్ -యూజి పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారంపై అంబేద్కర్ సంఘం మండల కన్వీనర్ బొల్లంపల్లి రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి, లక్షలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకున్న విద్యార్థుల భవిష్యత్తును ఈ లీకేజీలు అంధకారంలోకి నెట్టేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రింబవళ్లు శ్రమించి పరీక్ష రాసిన విద్యార్థులకు, పేపర్ లీక్ వార్తలు వినడం వల్ల తీవ్ర నిస్సహాయత, మానసిక వేదన కలుగుతోందన్నారు. ఇది అత్యంత దురదృష్టకరమన్నారు.గతంలో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన పేపర్ లీకేజీల మాదిరిగానే, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా పరీక్షలను పారదర్శకగా నిర్వహించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. అత్యంత రహస్యంగా ఉండాల్సిన ప్రశ్నపత్రం బయటకు ఎలా వచ్చిందో పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ఈ 'దొంగలు' ఎంతటి వారైనాఅటు అధికారులైనా, ఇటు రాజకీయ నాయకులైనావారిని ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలన్నారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి బందోబస్తు, పకడ్బందీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.అప్పుడే విద్యార్థులకు పరీక్షల పట్ల నమ్మకం కలుగుతుంది."లక్షల కుటుంబాల ఆశలను నీరుగార్చుతున్న ఈ కుంభకోణానికి కారకులైన వారిని వెంటనే పట్టుకొని శిక్షించాలి" అని బొల్లంపల్లి రాజు డిమాండ్ చేశారు.

# ప్రశాంతంగా పాలీసెట్ 2026

**జగిత్యాల మే 13(ప్రజా మంటలు) :**జిల్లా కేంద్రంలోని 8 పరీక్ష కేంద్రాలలో పాలిసెట్ 2026 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కోఆర్డినేటర్ ప్రొఫెసర్ అరిగెల అశోక్ తెలిపారు. జగిత్యాల పట్టణంలో 8 పరీక్ష కేంద్రాలకు గాను 2494 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అందులో బాలురు 1070, బాలికలు 1 424. నేడు జరిగిన పాలీసెట్ ప్రవేశ పరీక్షలో బాలురు 1006, బాలికలు 1323 మంది హాజరయ్యారు. జగిత్యాల పట్టణంలో మొత్తం 2494 అభ్యర్థులుగాను 2329 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని, 165 మంది గైర్హాజరయ్యారని, హాజరైన అభ్యర్థుల పరీక్ష శాతం 93.4% గా ఉందని జగిత్యాల జిల్లా కోఆర్డినేటర్ ప్రొఫెసర్ అరిగేలా అశోక్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ శ్రీ సత్య ప్రసాద్ , మరియు స్థానిక జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ , కమిషనర్ దేవసేన , మరియు పుల్లయ్య సెక్రటరీ మార్గదర్శనం చేయడంతో సరైన సూచనలు ఎంతో పని చేశాయని ప్రతి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ మరియు అబ్జర్వర్, కేటాయించబడినటువంటి వివిధ స్థాయి హోదాలో ఉన్న అధికారులు, స్పెషల్ అబ్జర్వేర్ అందరు కూడా సమన్వయంతో వ్యవహరించడం ద్వారా 2026 పాలీసెట్ ప్రవేశ పరీక్ష మూడు సంవత్సరాల డిప్లమో కోర్సు అభ్యర్థులు రాసి ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని వారందరికీ కూడా పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ప్రొఫెసర్ అరిగేల అశోక్ తెలిపారు.



## పరారీలో ఉన్నాడు..! అంటూ బండి భగీరథ్ పై పోస్టర్లు..



**సికింద్రాబాద్, మే 13 (ప్రజా మంటలు):** పరారీలో ఉన్నాడు.... కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు, ఫోక్సోకేసు నిందితుడు బండి భగీరథ్ కనిపించడం లేదు. ఆచూకీ తెలిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్ లో తెలియచేయండి...అంటూ బుధవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట,జూబ్లీ బస్ స్టేషన్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు అంటించారు. గుర్తు తెలియని వ్యక్తుల పని ఇదని భావిస్తున్నారు. కాగా ఆ తర్వాత జీహెచ్ఎమ్సీ సిబ్బంది పోస్టర్లను తొలగించారు. కాగా ఈ పోస్టర్ల ఉదంతం స్థానికంగా సంచలనం రేపింది. ఈ పని ఎవరు చేశారా అని బీజేపీ శ్రేణులు ఎంక్వైరీ చేస్తున్నట్లు తెలిసింది.

# ఓట్ల తొలగింపుపై దుష్ప్రచారం వద్దు

**మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి**

**సికింద్రాబాద్,మే 13 ( ప్రజామంటలు):**ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఏ ఒక్క కులానికో, మతానికో ఆపాదించి చూడవద్దని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు మర్రి శశిధర్ రెడ్డి కోరారు. బుధవారం సాయంత్రం బల్కంపేట్ బీకే గూడలోని మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సుజాతతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓట్ల సవరణ, బోగస్ ఓట్ల తొలగింపు ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించారు.అనంతరం మర్రి శశిధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఓట్ల తొలగింపు అనేది కేవలం ఎన్నికల పారదర్శకత కోసమే తప్ప, రాజకీయ ప్రయోజనాల కోసం కాదని స్పష్టం చేశారు. గతంలో బెంగాల్‌లో తొలగించిన 90 లక్షల బోగస్ ఓట్లలో ముస్లిం వర్గానికి చెందినవి కేవలం 30 లక్షలు మాత్రమేనని, మిగిలిన 60 లక్షల ఓట్లు ఇతర వర్గాలవేనని ఆయన ఉదహరించారు. దీనిని బట్టి చూస్తే అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని అర్థమవుతోందని, అనవసరంగా ఈ ప్రక్రియను భూతద్దంలో చూసి గందరగోళం సృష్టించవద్దని హితవు పలికారు. కేవలం అర్హులైన వారికే ఓటు హక్కు ఉండాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు.బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డితో పాటు పార్టీ నాయకులు ఇ. దయానంద్, ఆకుల మహేష్, క్రాంతి కుమార్, పి. నరేందర్, గుంటి సత్యనారాయణ, కె. నరేష్ పాల్గొన్నారు.



## వెల్గటూర్ మండల ప్రజలకు పోలీస్ శాఖ ముఖ్య సూచనలు

**రాత్రి వేళలో పశువులని రోడ్లపైకి వదులుతే కఠిన చర్యలు**

**ఎస్ఐ,ఉదయ్ కుమార్**



**గొల్లపల్లి మే 13 ప్రజా మంటలు (అంకం భూమయ్య ) :**ఇటీవలి కాలంలో రాత్రి పూట బయట సంచరిస్తున్న ఆవులు, ఎద్దులు, బర్రెల వంటి పశువుల వల్ల రోడ్ యాక్సిడెంట్స్ వలన ప్రజలకు ఇబ్బంది పడుతున్నారు గొల్లపల్లి పోలీసులు సూచిస్తున్నారుపశువుల యజమానులు తమ ఆవులు, ఎద్దులు, బర్రెలను రాత్రి సమయంలో తప్పనిసరిగా తమ ఇళ్ల వద్ద లేదా భద్రమైన ప్రదేశాల్లో కట్టివేసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రివేళ బయట రోడ్లపై లేదా ఖాళీ ప్రదేశాల్లో ఒకవేళ రాత్రి సమయంలో సంచరిస్తున్న పశువులు గుర్తించిన పక్షంలో, వాటిని "స్ట్రే అనిమల్స్"గా గుర్తించి గ్రామపంచాయతీ అధికారుల సహకారంతో ప్రభుత్వ అధీనంలోకి తీసుకునే చర్యలు చేపడతామని అన్నారు ప్రజలు పోలీసు శాఖకు సహకరించి తమ పశువులను సంరక్షించుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు కనబడితే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ ఐ,కృష్ణ సాగర్ రెడ్డి అన్నారు

## సికింద్రాబాద్ లో కాంగ్రెస్ 'సంఘటన్ సృజన్ అభియాన్



**సికింద్రాబాద్,మే 13 ( ప్రజామంటలు) :** దళిత సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం బుధవారం సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో జరిగింది. ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భేటీకి ఉమ్మడి హైదరాబాద్ జిల్లా అబ్జర్వర్ హెచ్.ఆర్. మోహన్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతం, ఎస్సీ విభాగం రాష్ట్ర, జిల్లా కమిటీల పునర్వ్యవస్థీకరణపై ఈ సందర్భంగా లోతుగా చర్చించారు.జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేలా జరిగిన ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు దీపక్ జాన్, ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ సాయి మధుకర్ గౌరవ అతిథులుగా పాల్గొని ఆశావహులతో భేటీ అయ్యారు. జిల్లా స్థాయి పదవుల కోసం భారీగా పోటీ నెలకొనగా, సుమారు 30 మందికి పైగా అభ్యర్థులు తమ దరఖాస్తులను పరిశీలకులకు అందజేశారు. సమర్థులైన వారికే పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నేతలకు దీపక్ జాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జై భీమ్ నినాదాలతో డీసీసీ కార్యాలయం హోరెత్తింది

# మినీ డైరీ దరఖాస్తు గడువు ఈనెల 20 వరకు పొడిగించాలనీ కలెక్టర్‌కు వినతి



**భీమదేవరపల్లి, మే 14( ప్రజా మంటలు):-** ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ద్వారా మినీ డైరీ యూనిట్ల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చునూరి కరుణాకర్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.బుధవారం భీమదేవరపల్లిలో ఆయన మాట్లాడుతూ, గత వారంలో రెండవ శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు రావడంతో పాటు చివరి రోజు మీ-సేవ కేంద్రాల్లో సర్వర్ సమస్యలు తలెత్తాయన్నారు. దీంతో పలువురు లబ్ధిదారులు కులం, నివాసం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందలేక దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. అర్హులైన ఎస్సీ, బీసీ నిరుపేదలకు న్యాయం చేసేందుకు గడువును ఈ నెల 20 వరకు పొడిగించాలని కలెక్టర్‌ను కోరారు. సాంకేతిక సమస్యల కారణంగా లబ్ధిదారులు నష్టపోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యా వారోత్సవాలలో ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సులొ పాల్గొన్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**జగిత్యాల మే 13(ప్రజా మంటలు) :**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పద్మనాయక కళ్యాణ మండపం లో జగిత్యాల నియోజకవర్గ స్థాయి విద్యా వారోత్సవాలలో సర్పంచులు కౌన్సిలర్లకు అవగాహన సదస్సు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల వరకు పరిమితం...నేను విద్య అభివృద్ధి కి చిత్తశుద్ధి తో పని చేస్తున్నా..విద్య వైద్యానికి జగిత్యాల ఒక కేంద్రంగా మారబోతోంది.అందరి సహకారం అవసరం.ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పన కోసం,అమ్మ ఆదర్శ పాఠశాల స్కీమ్ లో ప్రభుత్వం కృషి చేస్తోందని ,విద్యార్థులకు మంచి డైట్,కాస్మోటిక్,నాణ్యమైన భోజనం,దుస్తులు,అన్ని వసతులు కల్పించాలని ప్రభుత్వం కృషి చేస్తుంది అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదువే పేద మధ్యతరగతి పిల్లలకు అండగా ఉపాధ్యాయులు నిలవాలని మంచి ఫలితాల సాధన కోసం కృషి చేయాలని అన్నారు.విద్య తో వికాసం అని,విద్య తో సామాజిక ఆర్థిక అసమానతలు తొలగుతాయి అని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతం పెరిగే విదంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రవేట్ కి దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా వసతులు ఉన్నాయని పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ వాణి శ్రీనివాస్ , ఎంపీడీవోలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుట్ర రాజకీయాలతో బీజేపీని అడ్డుకోలేరు


**బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్**





**భీమదేవరపల్లి, మే 13:(ప్రజా మంటలు ):**బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న కుట్ర రాజకీయాలతో భారతీయ జనతా పార్టీని అడ్డుకోలేరని, ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న ఆ పార్టీ నాయకులను ప్రజలే తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ హెచ్చరించారు.బుధవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా పృథ్విరాజ్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.గత రెండున్నర సంవత్సరాలుగా మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై నోరు మెదపని బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు ఆధారాలు లేని కేసులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుటుంబాన్ని రాజకీయంగా టార్గెట్ చేయడం సిగ్గుచేటని అన్నారు.బీఆర్ఎస్ నాయకులు ఇన్వెస్టిగేషన్ అధికారుల లాగా ప్రవర్తిస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు.పదేళ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై బండి సంజయ్ పోరాడుతున్నారనే కక్షతోనే ఆయన కుటుంబంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూకబ్జాలు, అవినీతి చిట్టాను ప్రజల ముందు ఉంచుతామని, ప్రజల సహకారంతో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎన్ని కుట్రలు చేసినా చివరకు ధర్మమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, బొజ్జపురి పృథ్వీరాజ్, దొంగల రణప్రతాప్, లక్కిరెడ్డి మల్లారెడ్డి, సోప్పరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పీవీ విజ్ఞాన వేదిక పనులను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**భీమదేవరపల్లి మే 13(ప్రజా మంటలు):**భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ పి.వి. నరసింహారావు స్వగ్రామమైన వంగరలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'పీవీ విజ్ఞాన వేదిక' (స్మారక కేంద్రం) పనులను రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం జిల్లా కలెక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సందర్శనలో భాగంగా మంత్రి స్మారక భవనం,మ్యూజియం, ఫోటో గ్యాలరీ,కాన్ఫరెన్స్ హాల్ ల్యాండ్‌స్కేపింగ్ పనుల పురోగతిని నిశితంగా పరిశీలించి,అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.సివిల్ పనులు, సుందరీకరణ పనుల్లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఎక్కడా జాప్యం జరగకుండా పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పీవీ నరసింహారావు జీవిత విశేషాలను,వారు దేశానికి చేసిన సేవలను ప్రతిబింబించేలా మ్యూజియం ఏర్పాటు ఉండాలని పేర్కొన్నారు. పార్కులో మొక్కల పెంపకంతో పాటు, సందర్శకులకు అవసరమైన కనీస వసతులు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేసి,ఈ స్మారక కేంద్రాన్ని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.పర్యటనలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్థానిక గ్రామస్తులతో మమేకమయ్యారు.వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న మంత్రి, స్థానిక సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి,స్థానిక ప్రజాప్రతినిధులు,రెవెన్యూ సిబ్బంది, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీపీ ఇంట్లో పేలుడు ఘటన

**పలువురికి తీవ్ర గాయాలు**

**విజయవాడ అపార్ట్‌మెంట్‌లో ఏసీ, గ్యాస్ సిలిండర్ పేలుడు**

**ఎగిరిపడ్డ అపార్ట్‌మెంట్ గోడ**

**ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ముప్పు**

విజయవాడ పటమట లంకలో గ్యాస్ సిలిండర్ పేలుడు కలకలం సృష్టించింది. స్థానిక ప్రత్యూష అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులోని ఫ్లాట్‌లో 1991 బ్యాచ్‌కు చెందిన డీఎస్పీ సత్యానందం నివసిస్తున్నారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఆయన ఈ నెల 7న కుటుంబ సభ్యులతో కలిసి విదేశాలకు వెళ్లారు. సోమవారం సత్యానందం డ్రైవర్ ఫ్లాట్‌కు వచ్చి శుభ్రం చేయించారు. మంగళవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఫ్లాట్ బాల్కనీలోని ఏసీ అవుట్‌డోర్ యూనిట్‌లో మంటలు రేగాయి. అవి పక్కన తీగపై ఉన్న దుస్తులకు అంటుకుని విస్తరించాయి. బాల్కనీలో పెట్టిన రెండు వంట గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. వాటిలో నిండు సిలిండర్ పేలింది. ఆ ధాటికి ఖాళీ సిలిండర్ ఎగిరి పక్క అపార్ట్ మెంట్లో పడింది.పలువురికి గాయాలు: బాల్కనీ గోడ బద్దలైంది. ఇనుప గ్రిల్, గోడ శిథి లాలు 70 మీటర్ల దూరంలోని అపార్ట్‌మెంట్లలో పడ్డాయి. పక్కనే ఉన్న కాంచనగంగ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఉండి మంటలను చూస్తున్న వారిలో ముగ్గురికి శిథిలాలు తగిలి గాయాలయ్యాయి. వారిలో నగరంలోని ఓ స్కూలులో మేనేజర్‌గా పని చేస్తున్న గొట్టిపాటి శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే కుప్పకూలారు. ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. పేలుడు ఘటనపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.ఫ్లాట్ నుంచి మంటలు రావడం గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు వెంటనే ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అపార్ట్‌మెంట్ వాసులు కిందికి దిగి మంటలను గమనిస్తుండగానే ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఏసీ కంప్రెషర్, గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో బాల్కనీ గోడ, గ్రిల్స్ ఎగిరిపడ్డాయి. పేలుడు శబ్దానికి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనాస్థలాన్ని పోలీసులు, ఫైర్ సిబ్బంది పరిశీలించారు.'కిటికీలో నుంచి పొగలు వస్తుంటే అందరం ఇళ్ల నుంచి బయటకు వచ్చాం. అలా మేము గమనిస్తుండగానే ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ సిలిండర్ సహా ఏసీ పేలిపోయాయి. గోడ కూలి కాళ్లన్ని ఎగిరి పడ్డాయి. దీంతో చాలా మందికి గాయాలయ్యాయి. మేమంతా అక్కడ నుంచి పరుగెత్తాం. శ్రీనివాసరావు పరుగెత్తలేకపోయారు. గట్టిగా దూసుకు వచ్చిన రాయి తగిలి ఆయనకు పడిపోయారు.'



# జులాయి సినిమా మాదిరి పరిచయమైన దొంగలు

**కరీంనగర్ దోపిడీ కేసులో ట్విస్ట్**

**ఈ నెల 3న కరీంనగర్‌లో పట్టపగలు నగల దుకాణంలో దోపిడీ**

**11 నిమిషాల్లో కోటీ 5లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాల దోపిడీ**

**ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



కరీంనగర్‌లోని నగల దుకాణంలో దోపిడీ కేసులో రోజుకో విషయం బయటపడుతోంది. ఈ దొంగతనానికి పాల్పడింది కరడు గట్టిన సుబోధ్ గ్యాంగ్‌గా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు మిగిలిన నలుగురిని పట్టుకునేందుకు విస్తృత గాలింపులు చేపడుతున్నారు. దర్యాప్తులో దొరికిన ఫోన్ విస్తుపోయే విషయాల్ని బయటపెడుతోంది.ఈ నెల 3న పట్టపగలు కరీంనగర్‌లోని ఓ నగల దుకాణంలో దోపిడీ జరిగింది. దొంగలు 11 నిమిషాల్లో కోటీ 5 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. నిందితులని పట్టుకోవడం కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపులు చేపడుతున్నారు. విచారణలో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. వారు వినియోగించి పారేసిన ఓ ఫోన్ కీలక భూమిక పోషించినట్లుగా తెలుస్తోంది. ఆధారాలు లేకుండా చేద్దామని ధ్వంసం చేసిన ఫోనే పోలీసుల చేతికి చిక్కి వారి గుట్టు విప్పేలా కనిపిస్తోంది. బంగారాన్ని మాత్రమే దొంగిలించే బీహార్‌కు చెందిన సుబోధ్ ముఠానే దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది.ముఠాలోని కీలక సభ్యుడి ప్రణాళిక ప్రకారం ఈ దోపిడీ జరిగినట్లు అంచనా. 'జులాయి' సినిమాలో బ్యాంకు చోరీ మాదిరిగానే ఈ దోపిడీలో భాగమైన దొంగలు ఎవరనేది చోరీ సందర్భంలో తప్ప అంతకుముందు పరిచయమున్న వాళ్లు కారని సమాచారం. వేర్వేరు రాష్ట్రాలకు చెందిన వ్యక్తులను తనకున్న పరిచయాలతో ఒక్కచోటకు పిలిపించారని తెలిసింది. వారితో రెక్కీ నిర్వహించి బంగారు ఆభరణాలు చోరీ చేసే విధంగా ప్రధాన నిందితుడు ప్రణాళిక రచించారని పోలీసులు విచారణలో గుర్తించారు.ప్రధాన నిందితుడు బిహార్‌కు చెందినవాడు కాగా పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన వారిని సభ్యులుగా ఎంచుకున్నట్లు సమాచారం. వీరంతా వెయ్యి కోసం హత్యలు చేసేందుకు కూడా తెగించే వారని తెలుస్తోంది. రెక్కీ నిర్వహించే సమయంలోనే వీరంతా కలిసినట్లు గుర్తించారు. కొందరిని రైలు మార్గంలో ఇంకొందరిని బస్సు మార్గంలో ఒక చోట కలుసుకునేలా ప్రధాన సూత్రధారి సూచనలిచ్చినట్లు తెలిసింది. దొరికిన దొంగల్లో ఇద్దరు అసలు తమకు మిగతా సభ్యులెవరో తెలియదని వారి ఫోన్ నంబర్లు కూడా లేవని చెబుతున్నారని సమాచారం. ప్రధాన సూత్రధారి సెల్ ఫోన్ నంబరు మాత్రమే వీరివద్ద ఉందని చోరీలో భాగమైనందుకు వారితో కొంత మొత్తమిస్తానని బేరం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.నిందితులను పట్టుకోవడంలో వారు వాడి పారేసిన ఓ ఫోన్ కీలకంగా మారినట్లు తెలుస్తోంది. ఈ నెల 3న దొంగలు దోపిడీ చేసి ద్విచక్రవాహనాలపై పారిపోయారు. పరారయ్యే క్రమంలో బుగ్గారం మండలం మద్దునూర్ గ్రామ సమీపంలో దోపిడీ దొంగలు బైక్‌పై వెళ్తూ వారి వద్ద ఉన్న సెల్ ఫోన్‌ను బలంగా నేలకేసి కొట్టి వెళ్లిపోయారు. ఆ ఫోన్ చిన్నారుల చేతికి చిక్కింది. అది పెద్దలకు ఇవ్వగా అప్పటికే దోపిడీపై తీవ్ర చర్చ జరగడంతో దొరికిన ఫోన్‌ను వారు ఈ నెల 7న పోలీసులకు అప్పగించారని సమాచారం. చరవాణి ధ్వంసమైనా అది పనిచేస్తుండటంతో అందులోని సమాచారం ఆధారంగా దుండగులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ ఫోన్ వారి చిట్టాను విప్పొద్దని నిందితులు భావించారో అదే ఫోన్ వారి గుట్టును బయట పెడుతోంది.దోపిడీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు పూర్తిస్థాయిలో కేసును ఛేదించి ముఠా సభ్యులను పట్టుకునే దిశగా దూకుడును పెంచుతున్నారు. నాలుగైదు రోజుల్లో మిగతా సభ్యులను పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పరారీలో ఉన్నాడు

**గోడపై దర్శనమిచ్చిన పోస్టర్లు**

**బండి భగీరథ్ పరారీలో ఉన్నాడంటూ దర్శనమిచ్చిన పోస్టర్లు**

**శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో**

**అంటించిన గుర్తుతెలియని వ్యక్తులు**

**పోస్టర్లు తొలగించే పనిలో మున్సిపల్ సిబ్బంది**




కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పరారీలో ఉన్నాడంటూ ఈరోజు ఉదయం వెలసిన పోస్టర్లు హైదరాబాద్‌లో చర్చనీయాంశంగా మారాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ఉదయం ఈ తరహా పోస్టర్లు వెలిశాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు వ్యతిరేకంగా ఉన్న ఈ పోస్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు అంటించడం కలకలం రేపింది.శేరిలింగంపల్లిలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలైన గచ్చిబౌలి ఫ్లై ఓవర్, నలగండ్ల ఫ్లై ఓవర్‌తో పాటు మున్సిపల్ జోనల్ కార్యాలయ పరిసరాల్లో ఈ పోస్టర్లు దర్శనమిచ్చాయి. ఓ మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో బండి భగీరథ్ పరారీలో ఉన్నాడంటూ ఆ పోస్టర్లలో పెద్ద పెద్ద అక్షరాలతో రాశారు. పబ్లిక్ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ స్థాయిలో పోస్టర్లు ఉండటంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అయితే, ఈ పోస్టర్లను ఎవరు అంటించారు? దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వీటిని తొలగించే ప్రక్రియను చేపట్టారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.పోలీసుల విచారణకు బండి భగీరథ్ హాజరుకాలేదు. పోక్సో కేసు విచారణ కోసం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని ఆయనకు పోలీసులు మంగళవారం నోటీసులు ఇచ్చారు. భగీరథ్ తన మైనర్ కుమార్తెను వేధిస్తున్నాడంటూ 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్లో ఈ నెల 8న(శుక్రవారం రాత్రి) పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.ఈ అంశంలో తెలంగాణలో రాజకీయంగా వివాదాలు కొనసాగుతున్నాయి. బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలంటూ కొన్ని మహిళా సంఘాలు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేశారు. కొంతమంది మెట్రోలో పోస్టర్స్‌ను చూపుతూ అతన్ని రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు.

# డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసు

**అనంతబాబు బెయిల్ రద్దు , సుబ్రమణ్యం హత్య కేసు**

**సాక్షులను బెదిరించిన ఎమ్మెల్సీ అనంతబాబు**

**సుప్రీం బెయిల్ రద్దు చేసిన కోర్టు**



డ్రైవర్ వీధి సుబ్రమణ్యం హత్య కేసులో సాక్షులను బెదిరించిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానం రద్దు చేసింది. కేసు విచారణ పూర్తయ్యే వరకు ఆయన జైలులోనే ఉండనున్నారు. ఈ నెల 20 నుంచి రెగ్యులర్ విచారణ ప్రారంభం కానుంది.తన డ్రైవర్ వీధి సుబ్రమణ్యం హత్య కేసులో సాక్షులను బెదిరించిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు గతంలో సుప్రీంకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం రద్దు చేసింది.హత్య కేసులో బెయిల్‌పై బయట ఉన్న అనంతబాబు నలుగురు సాక్షులను ప్రలోభపెట్టి, తనకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపుతానని బెదిరించినట్లు ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా వారికి ఒక్కొక్కరికీ రూ. లక్ష చొప్పున ఇవ్వడం సహా తెల్లకాగితాలపై సంతకాలు చేయించారు. తనకు అనుకూలంగా తీర్పు చెప్పకపోతే చంపుతానని వాట్సప్ కాల్ చేసి చంపుతానని బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు ఏప్రిల్ 24న అనంతబాబును అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.హత్య కేసులో బెయిల్‌పై ఉంటూ సాక్షులను బెదిరించడాన్ని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. సాక్షులను బెదిరించినట్లు ఆధారాలతో నిరూపణ కావడంతో కోర్టు బెయిల్ రద్దు చేసింది. నిబంధనలను ఉల్లంఘించినందున బెయిల్ రద్దు చేయాలని పోలీసుల పిటిషన్ విచారించి బెయిల్ రద్దు చేసింది. పోలీసుల తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ల సుబ్బారావు వాదనలు వినిపించగా, బెదిరింపులకు సంబంధించి ఆధారాలతో నిరూపణ కావడంతో బెయిల్ రద్దు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.బెయిల్ రద్దుతో హత్య కేసు విచారణ పూర్తయ్యే వరకు అనంతబాబు జైలులోనే ఉండనున్నారు. ఈ నెల 20 నుంచి డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసు రెగ్యులర్ విచారణ ప్రారంభించనున్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది.'2022 మే 19న తన వద్ద పనిచేసే డ్రైవర్ సుబ్రమణ్యాన్ని కాకినాడలో చంపిన అనంతబాబు, తదనంతరం నేరాన్ని అంగీకరించారు. 218 రోజుల పాటు జైలు జీవితం గడిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో బెయిల్ రాగా, దాన్ని దుర్వినియోగం చేసి తిరిగి జైలు జీవితం గడపాల్సిన దుస్థితి తెచ్చుకున్నారు. డైవర్ హత్య కేసు విచారణ పూర్తయ్యే వరకూ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉండిపోనున్నారు.'

## పోక్సో కేసులో మహిళా అధికారిణికి జైలు శిక్ష విధించిన ఒంగోలు పోక్సో కోర్టు

**మర్రిపూడి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో పని చేస్తున్న మహిళ**

**బాలికకు పోర్న్ వీడియోలు చూపించి వేధింపులు**

**తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఆమెపై పోక్సో కేసు నమోదు**

**ఐదేళ్ల జైలు శిక్ష విధించిన పోక్సో కోర్టు**



మర్రిపూడి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రత్యేకాధికారిణిగా పనిచేస్తున్న ఒక మహిళ, అక్కడి విద్యార్థిని పట్ల అమానుషంగా ప్రవర్తించింది. బాలికను గదిలోకి తీసుకెళ్లి, ఏడుస్తున్నా వినకుండా కొట్టడమే కాకుండా, ఆమెకు పోర్న్ వీడియోలు చూపించి మానసిక వేధింపులకు గురిచేసింది. రక్షించాల్సిన స్థానంలో ఉన్న అధికారిణే ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.బాధిత బాలిక తన తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో, వారు పోలీసులను ఆశ్రయించారు. మర్రిపూడి పోలీసులు కేసు నమోదు చేసి, పక్కా ఆధారాలతో కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన ఒంగోలు పోక్సో కోర్టు న్యాయమూర్తి, నిందితురాలిపై నేరం రుజువు కావడంతో ఆమెకు ఐదేళ్ల కఠిన జైలు శిక్ష, రూ. 25,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. చదువుకోవాల్సిన వయసులో బాలికల పట్ల ఇలాంటి అకృత్యాలకు పాల్పడితే చట్టం ఎంత కఠినంగా ఉంటుందో ఈ తీర్పు నిరూపించింది. పోక్సో చట్టం నుంచి మహిళలు కూడా తప్పించుకోలేరనే విషయం ఈ తీర్పుతో నిరూపితమవుతోంది.

## యాపిల్‌ను అబ్బురపరిచిన విశాఖ కుర్రాడు

**టిమ్ కుక్‌ను కలిసే ఛాన్స్ కొట్టేశాడు!**

**యాపిల్ స్విఫ్ట్ స్టూడెంట్ ఛాలెంజ్‌లో విశాఖ విద్యార్థి మానస్ మల్ల విజయం**

**టాప్-15 ఎలైట్ జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయుడు**

**ఒత్తిడి లేని విద్య కోసం 'స్మైలీక్వెస్ట్' యాప్ రూపకల్పన**

**యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో సమావేశమయ్యే అరుదైన అవకాశం**



విశాఖపట్నానికి చెందిన యువ టెక్ నిపుణుడు మానస్ మల్ల ప్రపంచ వేదికపై తెలుగు కీర్తి పతాకను ఎగురవేశారు. టెక్నాలజీ దిగ్గజం యాపిల్ సంస్థను తన అసాధారణ ప్రతిభతో మెప్పించి, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. యాపిల్ ఏటా నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'స్విఫ్ట్ స్టూడెంట్ ఛాలెంజ్-2026'లో మానస్ విజేతగా నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా వేల మంది పోటీపడిన ఈ ఛాలెంజ్‌లో యాపిల్ ఎంపిక చేసిన టాప్-15 'ఎలైట్' జాబితాలో చోటు సంపాదించిన ఏకైక భారతీయుడిగా రికార్డు సృష్టించారు. ఈ విజయంతో ఆయన జూన్ 9న అమెరికాలో జరిగే యాపిల్ ప్రపంచస్థాయి డెవలపర్స్ సదస్సుకు (డబ్ల్యూడబ్ల్యూడీసీ) అధికారికంగా ఎంపికయ్యారు. ఈ సదస్సులో యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో ముఖాముఖి మాట్లాడే అరుదైన అవకాశం దక్కించుకున్నారు.మానస్ సాధించిన ఈ ఘనత వెనుక కేవలం సాంకేతిక నైపుణ్యమే కాదు, ఓ మానవీయ కోణం, బలమైన సంకల్పం ఉన్నాయి. ప్రస్తుతం విశాఖలోని గీతం డీమ్డ్ యూనివర్సిటీలో సీఎస్ఈ చదువుతున్న మానస్, విద్యార్థుల మానసిక ఒత్తిడికి పరిష్కారం చూపాలనే లక్ష్యంతో 'స్మైలీక్వెస్ట్' అనే వినూత్న యాప్‌ను రూపొందించారు. పోటీ పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక తన స్నేహితుడు ఒకరు ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన మానస్‌ను తీవ్రంగా కలచివేసింది. బట్టీ చదువుల వల్ల విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తొలగించి, ఒత్తిడి లేని అభ్యాసనను అందించాలనే తపనతో ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. తాను చిన్నప్పుడు అమెరికాలో చూసిన విద్యా విధానం కూడా ఇందుకు ప్రేరణగా నిలిచింది.'స్మైలీక్వెస్ట్' అనేది ఒక ఆఫ్‌లైన్ పర్సనలైజ్డ్ లెర్నింగ్ యాప్. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) టెక్నాలజీలతో పనిచేస్తుంది. విద్యార్థి చదువుతున్నప్పుడు వారి ముఖ కవళికలను గమనించి (ఫేషియల్ ట్రాకింగ్), పాఠం అర్థమవుతోందా లేదా అయోమయంలో ఉన్నారా అని ఏఐ ద్వారా గుర్తిస్తుంది. వారి మానసిక స్థితికి అనుగుణంగా, స్థానిక భాషలో సరదాగా, సులభంగా పాఠాలను బోధిస్తుంది. ఇంటర్నెట్ లేకపోయినా పనిచేయడం దీని ప్రత్యేకత. అంతేగాక వినికిడి, దృష్టి లోపాలున్న విద్యార్థులు కూడా సులభంగా ఉపయోగించుకునేలా దీన్ని రూపొందించారు.విశాఖ సాగర్ నగర్‌కు చెందిన మానస్ మల్ల, టెక్నాలజీని సమాజ హితం కోసం ఉపయోగించి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన విజయం తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశానికే గర్వకారణంగా మారింది. టిమ్ కుక్‌తో భేటీలో తన ఆలోచనలతో మరింతగా రాణించి, దేశ కీర్తిని ఇనుమడింపజేయాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## పాత ప్రేమ... ప్రాణాల మీదికి తెచ్చింది


**పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో దారుణం**

**పదో తరగతిలో ప్రేమించుకున్న వంశీ, అలేఖ్య , తర్వాత నవీన్‌తో అలేఖ్య వివాహం**

**గత సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలిసిన అలేఖ్య, వంశీ**

**అలేఖ్య నెంబర్ తీసుకుని సందేశాలు పంపించిన వంశీ**

**స్నేహితుడితో కలిసి వంశీని హత్య చేసిన అలేఖ్య భర్త**



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగిరెడ్డిపల్లికి చెందిన వంశీ, అలేఖ్య పదో తరగతిలో ప్రేమించుకున్నారు. కొన్నాళ్లకు అలేఖ్యకు నవీన్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. గత సంవత్సరం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా అలేఖ్య ఫోన్ నెంబర్ తీసుకున్న వంశీ, ప్రేమ పేరుతో వేధించాడు. దీంతో నవీన్ తన స్నేహితుడితో కలిసి వంశీని హత్య చేశాడు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సింగిరెడ్డిపల్లికి చెందిన వంశీ, అలేఖ్య పదో తరగతి చదువుతున్న సమయంలో ప్రేమించుకున్నారు. ఆ తర్వాత నవీన్‌ను అలేఖ్య ప్రేమించి పెళ్లి చేసుకుంది. 2025 ఫిబ్రవరిలో పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆ సమయంలో అలేఖ్య ఫోన్ నెంబర్‌ను వంశీ తీసుకున్నాడు. తరుచూ ఆమెకు సందేశాలు పంపించేవాడు. ఫోన్ చేసి వేధించేవాడు.కొన్ని సందర్భాలలో హైదరాబాద్‌లో ఉంటున్న అలేఖ్య ఇంటికి వెళ్లి గొడవ చేశాడు. విషయం తెలుసుకున్న అలేఖ్య భర్త నవీన్, తన మిత్రుడు భాస్కర్‌తో కలిసి వంశీని మందలించాడు. అలేఖ్యను అదేపనిగా వేధిస్తుండటంతో వంశీని హతమార్చాలని నవీన్ నిర్ణయించుకున్నాడు. భాస్కర్‌తో కలిసి పథకం వేశాడు. గత నెల 30వ తేదీన వంశీని హైదరాబాద్‌కు రప్పించి, భాస్కర్ ఫ్లాట్ కు తీసుకెళ్లి పథకం ప్రకారం మద్యం తాగించి కత్తితో పొడిచి హత్య చేశారు.నవీన్, భాస్కర్ కలిసి వంశీ మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేసి మ్యాట్‌లో చుట్టి కారు డిక్కీలో పెట్టుకుని, మంథని మండలం గాడుదులగండి ప్రాంతానికి తీసుకువచ్చి, రోడ్డు పక్కన లోయలో పడేశాడు. ఇంట్లో రక్తపు మరకలను తుడిచివేశారు. వంశీ కనిపించకపోవడంతో అతని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుల నుంచి కారు, ఐదు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com